క్లుప్తంగా

జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర కార్యదర్శులు



బాపట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చేజర్ల నారాయణరెడ్డి, మోదుగుల బసవ పున్నారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించటంపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపినట్లు చేజర్ల, మోదుగుల తెలిపారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె(చెరుకుపల్లి): కృష్ణానది పరివాహక ప్రాంతంలోని గ్రామాలలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. కృష్ణానది వరద నీటి ప్రవాహాన్ని బుధవారం ఆయన పెనుమూడి గ్రామం వద్ద అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎగువ నుంచి వరద నీరు అధిక మొత్తంలో వస్తున్న నేపథ్యంలో వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున మత్స్యకారులు కృష్ణానదిలోకి వేటకు వెళ్లరాదని తెలిపారు. అదేవిధంగా తమ పశువులను సైతం లంకల్లోకి తీసుకెళ్లటం ప్రమాదకరమన్నారు. అలాగే వరదలతో ప్రాణ ఆస్తి నష్టాలు వాటిల్లకుండా ముందొస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సందర్భంగా పెనుమూడి, పల్లెపాలెం, రావిఅనంతారం గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాయకులు స్లిప్పులు రాసి ఇచ్చిన వారికే ఎరువులా..! - ఎంపీపీ



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): నాయకులు స్లిప్పులు రాసిచ్చిన వారికే యూరియా ఇస్తారా అని పిట్టలవానిపాలెం ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు మండల వ్యవసాయాధికారి సత్యానంద్‌ను ప్రశ్నించారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఎన్నో ఇబ్బందులకోర్చి క్యూలైన్లో నిలుచుని ఉంటే మీరేమో నాయకుల రికమండేషన్‌తో స్లిప్పులు తీసుకొచ్చిన వారికి యూరియా ఇచ్చారని మండిపడ్డారు. రైతులందరికీ యూరియా అందించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందని ఇకపై సక్రమంగా రైతులకు యూరియా అందించాలని చెప్పారు. ఎంపీడీవో సీహెచ్ శేఖర్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులందరూ ఆయా శాఖలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యే విధంగా కృషి చేయాలని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యం



బాపట్లటౌన్: పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమని మాజీ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ తెలిపారు. మండలంలోని ఈస్ట్ బాపట్ల పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ పరిసరాల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. నేడు మనం నాటే మొక్కలే భవిష్యత్‌లో మన కుటుంబాలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరహాపురంలో వీధి లైట్ల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్

వరహాపురం(వేమూరు): వరహాపురం గ్రామంలో బుధవారం వీధి లైట్లను ఏర్పాటు చేశారు. వరహాపురం.. అంధకారం శీర్షికన బుధవారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి స్టాలిన్‌బాబు గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు, బ్లీచింగ్ పిచికారీ చేయడం జరిగిందని తెలిపారు. గురువారం దోమలు మందు కూడా పిచికారీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

గుంతల రోడ్డుతో అవస్థలు

- అధ్వానంగా ఉన్న చినపరిమి–తెనాలి రోడ్డు
- రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగిపోయిన వైనం
- వర్షాకాలంలో మరింత ఇబ్బందిగా ప్రయాణం



తెనాలి నుంచి చినపరిమి రోడ్డు

చుండూరు(వేమూరు): చినపరిమి– తెనాలి రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ప్రయాణం చేయడం నరకంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామం నుంచి తెనాలికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా తయారయింది. చినపరిమి నుంచి గ్రామస్తులు వివిధ అవసరాల నిమిత్తం నిత్యం తెనాలి వెళ్తుంటారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులకు ప్రయాణం మరింత కష్టంగా మారింది. దానికి తోడు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డును మూసివేస్తున్నాయి. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో ప్రయాణం చేయడం చాలా మరింత ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు అన్నీ పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 దాటినా ఇంతవరకు రోడ్లు గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులగా వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు నిలిచిపోయి ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడిపోవడం జరుగుతుందని అంటున్నారు. ప్రభుత్వం, ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే రోడ్డుకు ఇరుపైపులా చెట్లు, ముళ్లపొదలు తొలగించి, రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నరకంగా ఉంది



చినపరిమి రోడ్డు గుంతలతో చాల నరకంగా ఉంది. ప్రభుత్వం వెంటనే రోడ్డు వేయాలి. వర్షాల కాలంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణం మరింత కష్టంగా మారింది.

– తమ్మా పాముల రెడ్డి, చినపరిమి

రోడ్లు వేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో రోడ్లు మొత్తం పూర్తి చేస్తామని ఎన్నికల ముందు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు ఒక రోడ్డు కూడా వేయాలేదు. వెంటనే కూటమి ప్రభుత్వం రోడ్లు వేయాలి.

– తమ్మా బసివి రెడ్డి, చినపరిమి

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

డీడీవో విజయలక్ష్మి

బాపట్లటౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో) విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని క్లాప్ మిత్రలకు బుధవారం ఎంపీడీవో రామకృష్ణతో కలిసి రక్షణ కిట్లను అందజేశారు. డీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వీటిని అమలు చేయడంలో ఉద్యోగులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజా ఆరోగ్యం కాపాడటంలో క్లాప్ మిత్రల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి జున్ను మరియమ్మ పాల్గొన్నారు.



రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న డీడీవో విజయలక్ష్మి



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అధికారులు

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రేపల్లె: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి భాధ్యత అని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల పరిసరాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుండివారిపాలెంలో పశు వైద్య శిబిరం

కర్లపాలెం: పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కర్లపాలెం మండల పశు వైద్యుడు తహ అన్సారీ చెప్పారు. మండల పరిధిలోని దుండివారిపాలెంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 550 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. రైతులకు సత్యసాయి ట్రస్ట్ ద్వారా ఉచితంగా పశువుల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది నాగతేజ, అబ్దుల్ రహీం, వంశీ, మోహన కృష్ణారెడ్డి, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసరావు, అర్జున్ రావు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

చెరుకుపల్లి: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా సిబ్బందిని మండలంలోని సమస్యలు, వారి పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నియంత్రించే విధంగా సిబ్బందికి తగు సూచనలు చేస్తామన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాద ప్రదేశాలను గుర్తించి ఎన్‌హెచ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్, మండల స్థాయి అధికారులతో చర్చించి వేగ నియంత్రణ బోర్డులు, లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాయని ఎస్పీ హెచ్చరించారు. పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలో ఉన్న కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు సీఐ ఆర్.సురేష్‌బాబు, ఎస్‌బీ సీఐ నారాయణ, స్థానిక ఎస్ఐ టి.అనీల్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

భట్టిప్రోలు: వరద ఉధృతి వస్తే గ్రామాల్లో ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందించేలా కృషి చేయాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలోని కృష్ణా నది పరీవాహక లంక ప్రాంతాలైన భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎటువంటి ఆపత్కర విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు అధికారులు సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో ప్రతి ఫిర్యాదును స్వీకరించి జవాబుదారీగా ఉంటూ సత్వర న్యాయం జరిగే విధంగా పని చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ డైల్ 100 వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ వెంట వేమూరు సీఐ పసుపులేటి వీరాంజనేయులు, ఎస్‌బీ సీఐ జి.నారాయణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

డ్వామా పీడీ విజయలక్ష్మి

వేమూరు: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కూలీకి పని కల్పించాలని డ్వామా పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం బుధవారం నిర్వహించారు. పోతుమర్రు గ్రామానికి మ్యాచింగ్ డ్రైన్ 800 మీటర్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో 200 మీటర్లు పూర్తి అయిందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆమె డ్రైన్‌ను పరిశీలించారు. జంపని గ్రామంలో హార్టికల్చర్ తోటలను పరిశీలించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని బలిజేపల్లి, వేమూరు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి మురుగు గుంతలు నిర్మించాలన్నారు. అక్టోబర్ 2వ తేదీన ఉపాధి పథకం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఆమె చెప్పారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఏపీవో సత్యకృష్ణ, టీఏ సుధీర్, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

బాపట్ల టౌన్: పోలీస్ సిబ్బంది కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు ఈ ఏడాది మే 20న గుండెపోటుతో మరణించారు. ఆయన సతీమణి సంతోష మాధురికి బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రూ.లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందన్నారు.





కోటిపల్లి సోమశేఖరాలయంలో...



మోదుకూరు కనకదుర్గ దేవస్థానంలో...



భట్టిప్రోలు మండలం వెల్లటూరులో...



నగరం సంతబజార్‌లో అన్నపూర్ణాదేవిగా...

ఘనంగా దసరా మహోత్సవాలు

దసరా వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు బుధవారం పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. మండలంలోని సుగ్గునలంక శివాలయంలో నిర్వహించిన దసరా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మహిళలు కొన్ని చోట్ల అన్నపూర్ణా దేవిగా, కొన్ని చోట్ల గాయత్రీదేవిగా.. ఇలా వివిధ అలంకారాలలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

– కొల్లూరు/చుండూరు(వేమూరు)/భట్టిప్రోలు/నగరం/వేమూరు/కర్లపాలెం/ రేపల్లె(చెరుకుపల్లి)



అబ్బనగూడవల్లి కోదండరామస్వామి దేవస్థానంలో...



అశ్వరూఢ మహాదేవిగా చందోలు పార్వతీదేవి



గుళ్ళపల్లి ఆనందీశ్వరస్వామి దేవస్థానంలో...



లలిత సమేత స్వయంభువేశ్వర దేవస్థానంలో...

పౌష్టికాహారంపై అవగాహన

భట్టిప్రోలు: తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ భట్టిప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ బి.సంపూర్ణ తెలిపారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం భట్టిప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంపూర్ణ మాట్లాడుతూ ఆకుకూరలు, రాగి, గోధుమ పిండి వంటి వాటితో రకరకాల ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే పోషక విలువలు కలిగిన పదార్థాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మొక్క నాటుతున్న ఎంపీడీవో తదితరులు



మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీవో మారుతి శేషాంబ

కర్లపాలెం: గ్రామ పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, గ్రామ పంచాయతీ అధికారులకు జరుగుతున్న రెండు రోజులు శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, అధికారులు ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సచివాలయాల వద్ద మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని చెప్పారు. గ్రామాలలో ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి జూట్ బ్యాగ్‌లు వినియోగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీలలో ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హరిత గోవాడ.. స్వచ్ఛ గోవాడ

అమర్తలూరు(వేమూరు): ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని ఎంపీడీవో మారుతి శేషాంబ అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామాన్ని హరిత గోవాడ.. స్వచ్ఛ గోవాడ కింద గుర్తించడం జరిగిందని ఆమె తెలిపారు. గోవాడ గ్రామంలో రెండు చెరువుల కట్టపై మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. హరిత గోవాడ.. స్వచ్ఛ గోవాడ కింద రెండు చెరువుల కట్టపై 200 వందల కొబ్బరి మొక్కలు నాటడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కోమల్, మండవ రమేష్, ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు.









వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేష్, నియోజకవర్గ సమన్వయకర్తలు వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ ఈవూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్ వర్క్

- స్మార్ట్ ఫోన్‌లు అందజేత

బాపట్ల: గ్రంథాలయ ఉద్యోగస్తులకు స్మార్ట్ ఫోన్‌లో గ్రంథాలయ కార్యకలాపాలపై శిక్షణ ఇచ్చి వారికి వాటిని అందించటం సంతోషంగా ఉందని గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఎం.పద్మజ పేర్కొన్నారు. బాపట్లలో గ్రంథాలయ ఉద్యోగస్తులకు బుధవారం స్మార్ట్ ఫోన్లు అందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి సుబ్బరత్నమ్మ, గ్రంథాలయాధికారి గణేషన్, శిక్షణ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (వేమూరు, రేపల్లె)
90109 62225 (పొన్నూరు, బాపట్ల)
Office mail : sakshigntadvt@gmail.com